


## డాక్టర్ చిట్టావూరి శివరామకృష్ణ శర్మ

**కథ**

*నేను కొత్తగా కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. అది ఒకప్పుడు బాగా పేరున్న కాలేజి. దానిలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించమని అధికారుల నుంచి పత్రాలు వచ్చాయి. ఇన్విజిలేటర్‌గా ఉండడానికి అంగీకారం తెలపమంటూ నోటీసు వచ్చింది. దానిలో యస్ ఆర్ నో వ్రాయమన్నారు.*

*నాకు మొదటి నుంచి చేయననడం అలవాటు లేదు. యస్ అని వ్రాశాను. ఈ గొడవలన్నీ ఎవడు పడతాడంటూ నాప్రక్కనున్నాయన 'నో' వ్రాశాడు. అది చూశాక దీనిలో ఏం సమస్యలుంటాయో? అని మనస్సులో ప్రశ్న ఉదయించింది. చూద్దాం అనుకున్నాను గాని ఎవరినీ అడగలేదు.*

ముందు రోజు సాయం కాలం మీటింగ్ పెట్టి ఇన్విజిలేటర్లు ఏం చేయాలో ఏం చేయకూడదో సంగ్రహంగా చెప్పారు. ఇన్విజిలేటర్లకు ఇన్‌స్ట్రక్షన్లు ఉన్న ఒక కాగితం ఇచ్చారు. అదంతా జాగ్రత్తగా చదివి నా బాధ్యత సరిగ్గా నిర్వహించాలని అనుకున్నాను. దానిలో చాలా నిబంధనలున్నాయి.

పరీక్ష వ్రాసే వారి మధ్య కమ్యూనికేషన్లు పనికి రావని అనాథరైజ్‌డ్ మెటీరియల్స్ పరీక్ష హాల్లోకి తీసుకొని రానీయరాదని పరీక్షార్థులు ఒకరి వస్తువులు మరొకరు తీసుకోకూడదని ఉంది. ఏది ఆథరైజ్డ్, ఏది అనాథరైజ్డ్ అనే విషయం మాత్రం అక్కడ రాయలేదు.

ఆ విషయం అడిగితే ఆ మాత్రం తెలియదా అంటారేమో! ఎలా తెలుస్తుందని ఆలోచిస్తూండగానే పరీక్ష సమయం వచ్చేసింది. కో ఆర్డినేటర్ ఇచ్చిన మెటీరియల్ పట్టుకుని పరీక్ష హాలుకి నడిచాను. నాతో పాటు మాకాలేజి క్లర్క్‌ను ఇన్విజిలేటర్‌గా వేశారు. పరీక్షల మధ్యలో రెండో శనివారం, ఆదివారం వచ్చాయి. ఇన్విజిలేటర్‌గా రావడానికి అంగీకరించిన వాళ్ళు గూడా ఆ రెండు రోజులు తమకు వెయ్యవద్దని అడ్డు చెప్పారట. దాంతో క్లర్కులను కూడా ఇన్విజిలేటర్లుగా వేశారు.

ఒక్కొక్కళ్లే పరీక్షార్థులు వస్తున్నారు. ప్రతి వాళ్ళ దగ్గర పెద్ద పెద్ద బ్యాగులు వాటి నిండా పుస్తకాలు ఉన్నాయి. అందులో ఏవి ఆథరైజ్‌డో, ఏవి కావో ఎలా తెలుస్తుంది.

అందరికీ సమాధాన పత్రాలు ఓ.యమ్.ఆర్ షీట్లు మొదట ఇచ్చి తరువాత ప్రశ్న పత్రాలు ఇచ్చాను. అందరూ పెద్ద బౌండ్లు తెరచి చూసి రాస్తున్నారు. కొందరు పుస్తకంలో పుస్తకం పెట్టి రాస్తున్నారు. అది చూస్తే నాకు మా పక్కింటి కుర్రాడు పాఠ్య వాచకంలో బూతు పుస్తకం పెట్టి వాళ్ళమ్మ కన్నుగప్పి చదివిన దృశ్యం గుర్తుకు వచ్చింది.

ఒకవేళ రెండు పుస్తకాల్లో విషయం కలిపి రాయడానికి అలా రెండు పుస్తకాలు తీసుకుని రాస్తున్నారేమో అని సరిపెట్టుకున్నాను.

ఇంతలో అబ్జర్వర్ వచ్చాడు. అమ్మయ్య! ఆయన అనాథరైజ్‌డ్ మెటీరియల్ తీసేస్తాడు కదా! అని ఊపిరి పీల్చుకున్నాను. ఆయన గంభీరంగా అటూ ఇటూ తిరిగి వెళ్ళిపోయాడు. ఆయన ఎదురుగానే పరీక్షార్థులు పుస్తకాలు మార్చుకుంటున్నారు. ఏ సమాధానం ఎక్కడుందని ప్రక్కవాళ్ళని అడుగుతున్నారు. హడావిడిగా పేజీలు తిప్పుతున్నారు. ఆయనేం పట్టించుకోలేదు.

మా కొలీగ్‌తో ఈ మాటంటే 'ఆ విషయాలు మనం పట్టించుకోకూడదు. నలుగురితో నారాయణ' అన్నాడు.

ఇంతలో ఒకతను వరండాలోకి వచ్చి 'కలీల్ ఇక్కడున్నారా' అని రెండుసార్లు అడిగాడు. ఒక పరీక్షార్థి లేచి అతని వద్దకువెళ్ళి వచ్చాడు. నాకు అనుమానం వచ్చింది. అతడెవరు? ఇతన్నెందుకు పిలిచాడు. ఒకవేళ పరీక్షా నిర్వాహక వర్గానికి చెందినవాడేమో!

ఇంతలో మరో అబ్జర్వర్ వచ్చాడు. ఆయన్ని అడిగాను అతడెవరండీ! 'కలీల్' అనే అభ్యర్థిని పిలిచాడు అని చెప్పాను. ఆయన 'అతడు పోలీసు' అంటూ ఆ కలీల్ ఎవరో తెలుసుకుని అతని దగ్గర ఉన్న కాపీలను తీసుకుని బయటకు విసిరేశాడు.

నేను తెల్లబోయాను. పరీక్షల దగ్గర శాంతిభద్రతల పరిరక్షణ కోసం వచ్చిన పోలీసు కాపీ అందించడమా! ఎంత ధైర్యం బహిరంగంగా పిలిచి మరీ కాపీ ఇచ్చాడు.

అబ్జర్వర్ 'మేడ్ ఈజీ' అని వ్రాసి ఉన్న కొన్ని పుస్తకాలు తీసుకుని నా కుర్చీ దగ్గర పడేశాడు. అమ్మయ్య! నా ప్రశ్నకిప్పటికి సమాధానం లభించింది. 'మేడ్ ఈజీ' అని వ్రాసి ఉన్న పుస్తకాలు పనికి రావన్న మాట. తరువాత నేను కూడా అలాంటి పుస్తకాలు కొన్ని పరీక్షార్థుల దగ్గర నుంచి తీసి నాటేబుల్ ప్రక్క పడవేశాను.

అబ్జర్వర్ వెళ్ళిన వెంటనే పరీక్షార్థులు ఆ పుస్తకాలు ఇమ్మంటూ నాపై ఒత్తిడి ప్రారంభించారు. ఆయన తీసివేసినవి నేనివ్వకూడదని గట్టిగా చెప్పాను. ఒకాయన నా అనుమతితో సంబంధం లేకుండా నా టేబుల్ దగ్గరకు వచ్చి ఒక పుస్తకం తీసుకుని వెళ్ళి పరీక్ష రాస్తున్నాడు. నేను వెళ్ళి మళ్ళీ ఆ పుస్తకం తెచ్చి నా టేబుల్ దగ్గర పడవేశాను.

ఇంతలో ఒక అధికారి అటువైపు వచ్చాడు. పరిస్థితి ఆయనకు చెప్పి, ఆ పుస్తకాలు అక్కడి నుంచి పట్టుకుపొమ్మని కోరాను. ఆయన 'అలాగే' అన్నారు. కాని ఆ పని జరగలేదు. ఈసారి అబ్జర్వర్ వచ్చినపుడు ఆ పుస్తకాలు అవతల పడవేయించమని కోరాను. ఆయన అధికారితో చెప్పాడు. ఆ అధికారి అటెండర్‌తో చెప్పి సగం పుస్తకాలు తీయించేసరికి పరీక్షార్థులు అవి కలిసి పోతాయి అంటూ గొడవ పెట్టడం ప్రారంభించారు. కొన్ని పుస్తకాలక్కడ వదిలి వేసి అధికారి, అబ్జర్వర్, అటెండర్ వెళ్ళి పోయారు.


ఇంతలో ఒక పరీక్షార్థి నా టేబుల్ దగ్గరకు వచ్చి పుస్తకం పట్టుకు పోతున్నాడు. నేను దాన్ని తీసుకుని అటెండర్ని పిలిచి అవతలికి పంపాను. పరీక్షార్థి అటెండరు వెంట పడ్డారు. నాతో వచ్చిన ఇన్విజిలేటరు బయటికి వెళ్ళి అటెండరు దగ్గర ఆ పుస్తకం తీసుకుని ఆ

పరీక్షార్థికి ఇచ్చాడు. నాకు కంపరం వచ్చింది.

ఇంతలో ఒక లెక్చరర్ వచ్చి ట్రెజరీలో మన జీతాలు చూచే క్లర్కు కూడా పరీక్ష రాస్తున్నాడు. అతని విషయం జాగ్రత్తగా చూడమని నా ప్రక్క ఇన్విజిలేటరుతో చెప్పాడు. నాకు నోట మాటరాలేదు.

ఇంక ఎవరెలా వ్రాసినా పట్టించుకోకూడదని అనుకున్నాను. నా కుర్చీలోనే కూర్చుని ఎవరేం చేస్తున్నారో గమనిస్తున్నాను.

ఒకావిడ ఒక పది పుస్తకాలను బెంచి మీద వేసి వాటి మీద కూర్చుంది. ఒక్కొక్క పుస్తకమే తీస్తూ చూసి రాస్తోంది. ఇంకొకాయన ఒక పాత పుస్తకంలో జిరాక్సు తీసిన కాగితాలు మధ్యలో అతికించి ఎవరూ చూడకుండా అవి చూసి రాస్తున్నాడు. కొందరు కాగితాల్లో రాసి కాపీలు అంటించు




కుంటున్నారు. మరి కొందరు ప్రశ్న పత్రాలపైన పేజి నెంబరు వ్రాసి పక్క వాళ్ళకు చూపుతున్నారు. ప్రక్కవాళ్ళు ఫలాని పుస్తకంలో ఫలాని పేజిలో ఆన్సరు ఉందని చెప్పినా వారికి తెలియడం లేదు. అందుకని పుస్తకంలో వేలుపెట్టి ఇక్కడి నుంచి ఇక్కడి వరకు రాయాలని చూపిస్తున్నారు. దానిని చూస్తే భాషా సమస్య గూడా ఉందనిపించింది. ఆ మధ్య పేపరులో ఓ వార్త వచ్చింది. కొందరు పోలీసు అధికారులు తగిన ఆంగ్ల భాషా పరిజ్ఞానం లేక కేసులను సరిగా నమోదు చేయలేకపోతున్నారని, దాని మూలంగా డెబ్భై శాతం కేసులను కోర్టులు కొట్టి వేస్తున్నాయని జనానికి అధికారులకు కూడా సరిగా రాని భాషలో వ్యవహారం సాగిస్తుంటే చేసే పనుల వల్ల ప్రయోజనం లేకుండా పోతుంది. ఈ గ్రంథాలు మాతృభాషలో ఉంటే ఈ పీడ ఉండదు కదా! అనుకున్నాను. కానీ వారి చేష్టలన్నీ చూస్తూ ఉండలేక పోతున్నాను.

పట్టుకున్నా ఏం లాభం! నేను పట్టుకుంటే మరొకళ్ళు ఇచ్చేస్తుంటే ఏం చేయాలి? నాలో చాలా సంక్షోభం కలుగుతోంది. అప్పటికపుడే రెండు గంటలు అయిపోయింది. మరొక్క గంట ఉంది.

ఇంతలో మరో అబ్జర్వర్ వచ్చాడు. "అందరూ మీమీ బ్యాగులు వేదిక మీద పెట్టండి. మేడ్ ఈజీలు, గైడులు వెంటనే తీసివేయండి" అని అరిచాడు. చాలామంది లేచి తమ బ్యాగులు కొన్ని పుస్తకాలు తెచ్చి నా కుర్చీ ఉన్న గట్టుపై పెట్టారు. తరవాత ఆ అబ్జర్వర్ ఒక పరీక్షార్థి దగ్గరకు వచ్చి ఓ పుస్తకం పట్టుకున్నాడు.

మరో పరీక్షార్థి దగ్గరకు వచ్చాడు. ఆవిడ దగ్గర పుస్తకాలు చాలా వున్నాయి. "ఏం అమ్మా! పుస్తకాలు ఎందుకు తీయలేదు?" అబ్జర్వర్ ప్రశ్న.

"నేనిప్పుడే కొన్నానండీ! వాటిలో ఏమున్నాయో నాకు తెలీదు" ఆవిడ అమాయకత్వం నటిస్తూ జవాబు చెప్పింది. అబ్జర్వర్ విసుక్కుంటూ ఈ విషయం రాశానంటే అయిదు ఇంక్రిమెంట్లు ఎగిరిపోతాయి. అని హెచ్చరించి ఆ పుస్తకాలన్నీ తీసుకొని నా దగ్గర పడవేసి బయటకు వెళ్ళిపోయాడు.

ఇక నేను ధైర్యం చేసి ప్రతి పరీక్షార్థి దగ్గరకు వెళ్ళి మేడ్ ఈజీ అని వ్రాసివున్న పుస్తకాలు, టెస్ట్ పేపర్లు, జవాబులు ఉన్న పుస్తకాలు ఏరి వేశాను. కొందరు ఆ పుస్తకాలు ఇమ్మని సైగలు చేశారు కాని నేనటు వైపు చూడకుండా మొగం త్రిప్పుకొన్నాను. పాత పుస్తకంలో జిరాక్స్ కాగితాలు అతికించినవి కూడా తీసేశాను. అది పెద్ద పుస్తకం. మూడుసార్లు ఆ పుస్తకంలో జిరాక్స్ కాగితాలు పట్టుకున్నాను. నేను కొంతవరకయినా ఇన్విజిలేషన్ చేశానని సంతృప్తిపడ్డాను.

ఇంతలో అబ్జర్వర్ బయటనుంచి ఒకావిడ పేపరు వైపు చూచాడు. వెంటనే లోపలికి వచ్చి ఆవిడ ఆన్సర్ పేపరును దాని ప్రక్కన ఉన్న సన్నీ గైడును లాక్కుని 'ఆవిడకి ఇవ్వకండి' అని చెప్పి నాకిచ్చి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.


ఆవిడ "ప్లీజ్ ఇంకో రెండు జవాబులు వ్రాస్తాను. ఇవ్వండి" అని నన్ను బ్రతిమాలుతోంది.

ఈ పుస్తకం ఎందుకు తీయలేదు? ప్రశ్నించా డాయన. పరీక్షార్థి "దాని లోది నేను రాయలేదండీ" అని జవాబిచ్చాడు. "నేను తీసివేయమని చెప్పాను గదా! మీరెందుకు తీయలేదు?" మళ్ళీ అబ్జర్వర్ ప్రశ్న. దానికి జవాబు లేదు.

"మీరూ టీచర్ గదా! మీ విద్యార్థి ఇలా చేస్తే మీరేం చేస్తారు?" అబ్జర్వర్ మళ్ళీ అడిగాడు.

పరీక్షార్థి మొగం మాడిపోయింది. "ఆ విద్యార్థి పేపరులు లాగేసుకుంటాను" అంటూ తన పేపరు అబ్జర్వరుకివ్వబోయాడు.

అబ్జర్వరు మేడ్ ఈజీ పుస్తకం మాత్రం తీసుకొని అవతల పడవేసి



నేను "ఆయన ఇవ్వవద్దని చెప్పిన తరువాత నేనిస్తే నేను ఇరుక్కుంటాను. మీరా యననే వెళ్ళి బ్రతిమా లుకోండి" అని చెప్పాను.

ఆవిడ రెండు సార్లు వెళ్ళి నా పని జరగలేదు. మూడోసారి ఆయన కరిగాడు. మళ్ళీ పేపరు ఇమ్మన్నాడు- ఇవి పెద్దల పరీక్షలు. పెద్దలు పిన్న లైన వేళయిది.

ఈ తంతంతా చూస్తుంటే నాకు అంతకు ముందు జరిగిన పిల్లల పరీక్షలు గుర్తుకు వచ్చాయి. వాటికి చాలా నిబంధనలు పెట్టి పెద్ద హడావుడి చేశారు. ఒక విద్యార్థి బెంచికి ఈ చివర, రెండో విద్యార్థి ఆ చివర బెంచీ రాడ్‌కు ఇవతల ఒక

కాలు, లోపల ఒక కాలు పెట్టి కూర్చోవాలి. హాలు టిక్కట్టు తప్ప సంబంధం లేనివయినా సరే ఎలాంటి కాగితాలు దగ్గర ఉండకూడదు. తాము కూర్చున్న చోటుకి చుట్టు ప్రక్కల ఏ చెత్త కాగితం ఉన్నా తమదే బాధ్యత. బెంచీ మీద ఏం వ్రాసి ఉన్నా తామే ముందు చెప్పాలి. ఇన్విజిలేటర్లు ప్రశ్నాపత్రం చదవకూడదు- ఇలా పెద్ద నిబంధన లిస్టు ఇచ్చారు. పరీక్ష రోజు మూడు పేపర్లలో ఒక సెట్టును లాటరీ ద్వారా ఎంపిక చేసి రేడియో ద్వారా ఫలాని నెంబరు సెట్టును ఉపయోగించం డని తెలిపేవారు. ఇంత హడావిడి చేశాక ఆ పేపర్లు లీకయ్యా యని చివర తెలియడం కొసమెరుపు.

ఇంతలో వార్నింగ్ బెల్ కొట్టారు. ఆ ధ్వనికి నేనీ లోకంలోకి వచ్చాను. నేను ఎడిషనల్ షీట్ల ఎక్కౌంట్ చూస్తుంటే ఓ పరీ క్షార్థి చివర అరగంట కూడా వదల్లేదు. పరీక్ష చెడగొట్టాడు అంటూ నన్నే తిడుతున్నాడు. నేను దాన్ని పట్టించుకోకుండా ఎడిషనల్స్ ఎన్ని రాశారో నోటు చేయమని, పేపరుకు దారం కట్టమని హెచ్చరించాను.

లాంగ్‌బెల్ అయ్యింది. తాడు కట్టలేదనే వారు కొందరు, ఎడిషనల్స్ ఎక్కౌంటు వేయలేదనేవారు కొందరు, మీరు ముందు మాకు ఎందుకు చెప్పలేదనే వారు మరికొందరు. చెప్పినా వినిపించుకోని వారిని ఏం చేయాలి? మొత్తానికి అందరి దగ్గర నుండి పేపర్లు తీసుకొని వాటిని వరుసలో పెట్టి లెక్కపెట్టి రూములోంచి బయటపడ్డాం. ఒకావిడ 'థాంక్సండీ' అంది. తలెత్తాను ఆవిడ దగ్గిర గైడ్ తీసుకున్నందుకు ఆవిడ కోపాన్ని అలా వ్యక్తం చేసింది.

'పక్షపాతం పనికిరాదు కదా! ఒకరి దగ్గిర గైడు లాక్కుని మరొకరి దగ్గిర వదిలి వేయడం ఎలాగండీ' అన్నాను సంజా యిషీగా.

దానికామె ఆ పుస్తకాల్లో ఎక్కడేమున్నాయో ఓ పట్టాన కన బడవండీ. మరేం చెయ్యాలి. ఎదురు ప్రశ్న వేసిందామె.

మరొకాయన "ఈ డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్స్ మీరింకా రాయలేదు. రాసేటప్పుడు తెలుస్తుంది వ్యవహారం" అన్నాడు వెటకారంగా.

"మేమూ ఉద్యోగులమే. కనీసం అది గూడా గుర్తుంచుకోక పోతే ఎలా" అన్నాడు మరొకాయన. నేరం చేసినట్టు తలవం చుకుని గబగబా నడుచుకుంటూ స్టాఫ్ రూమ్‌కి వెళ్ళి అక్కడ అధికారులకు పేపరులు అప్పగించి బయటపడ్డాను.

పుస్తకాలు చూసినా రాయడానికి శక్యం కాకుండా ఉంటుం దా ఈ పరీక్ష? దీన్ని సరళం ఎందుకు చెయ్యకూడదు? గైడు ఉపయోగించకూడదన్నపుడు వాటిని హాలులోకి ఎందుకు తీసుకురానివ్వాలి? తెచ్చినవి పట్టుకుని ఎందుకు వదిలేస్తు న్నారు?

ఇక్కడ పరీక్షలు వ్రాసేవాళ్ళు ఉపాధ్యాయులు, ప్రధానోపా ధ్యాయులు, లెక్చరర్లు, వివిధ విభాగాల్లో ఆఫీసర్లు, ఉద్యోగు లు. వీరికే పాఠ్య విషయాలు తెలియకపోతే ఆ ఉద్యోగ బాధ్యతల నెలా నిర్వర్తిస్తారు? విషయ జ్ఞానం లేని వీరుద్యో గులయితే సంఘం అస్తవ్యస్తం కాదా? వీరు భావి పౌరులనెలా గొప్పవారిగా తీర్చిదిద్దగలరు?

పూర్వం పాఠశాలల్లో మోరల్ పీరియడ్లు ఉండేవి. అలా నీతిని శీలాన్ని బోధించడానికి చదవడానికి ఇపుడు సమయం చాలడం లేదు. జాతి శీలాన్ని తీర్చిదిద్దడం కూడా మనకు చేతకాలేదా?

స్వాతంత్ర్యం వచ్చి ఏభయి సంవత్సరాలయినా ప్రజలకు అను కూలమయిన, ఆచరణాత్మకమయిన, సరళమయిన వ్యవస్థల నేర్పాటు చేసుకోవడంలో మనం వైఫల్యం పొందామా?


ఇలా జవాబు లేని ప్రశ్నలతో తలనెప్పి వచ్చి భారంగా ఇంటికి చేరాను.

•




## శనివారం దాకా బిజీ

ప్రతిరోజు బిజీగా ఉండేవారికి సెలవురోజైన ఆదివారం వచ్చిం దంటే చెప్పలేనంత ఆనందం. ఎందుకంటే వారంరోజుల



అలసత్వాన్ని ఆదివారం ఒక్కరోజే కొట్టిపారేస్తుంది. అందుకే ఆదివారం అంటే నాకు చాలా ఇష్టం. నేను ఫొటోగ్రాఫర్‌ని. శనివారం వరకు చాలా బిజీగా ఉంటాను. ఆదివారం ఎప్పుడువస్తుందా అని ఎదురుచూస్తుంటాను. ప్రతిరోజూ 5 గంట లకే నిద్రలేస్తాను. సెలవురోజు మాత్రం 9 గంటల వరకు పడుకుంటాను. ఆదివారం ఎక్కువగా టివి చూస్తుంటాను. స్నేహితులతో సినిమాలకు, షికార్లకు వెళుతూ సరదాగా కాలక్షేపం చేస్తాను.

**- ఎం.కృష్ణ,**

**కోట్‌పల్లి, పెద్దేముల్ మండలం**

## వినోదాన్నిచ్చే రోజు

నేను బి.ఎడ్ స్టూడెంట్‌ని. ప్రతి ఆదివారం ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్ళడం ద్వారా నా దినచర్య ప్రారంభమవుతుంది.



దాని తర్వాత గ్రంథాలయానికి వెళ్ళి ఆరోజు దిన పత్రికలు చదువుతాను. వివిధ రకాల అల్లికలతో వస్తువులు తయారుచేయడం, రేడియో వినడం నా అలవాటు. సాయంత్రం స్నేహితులతో కలిసి సిని మాకు వెళుతుంటాను. సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రజలలో చైతన్యాన్ని తీసుకురావ దానికి సమావేశాలు ఏర్పాటుచేసి ప్రసంగిస్తాను.

**- బద్దనపెల్లి యెషమా,**

**బోధన్, నిజామాబాద్ జిల్లా**

## మిత్రులతో కలిసి ట్రస్టు సేవలు

నేను జనగామ ఏరియా ఆసుపత్రిలో విసిటిసి కౌన్సెలర్‌గా పని చేస్తున్నాను. వరంగల్, జనగామ ప్రాంతంలో ఉన్న



స్వచ్ఛంద సంస్థల సహాయంతో ప్రతి ఆదివారం ఏదైన ఒక వీధిలో ప్రజలను లేదా కాలేజి విద్యార్థు లను సమావేశపరచి, హెచ్ఐవి/ ఎయిడ్స్/ టిబి అన్నిరకాల ఆరోగ్య విషయాల గురించి, వ్యక్తిత్వ వికాసం గురించి, ప్రతి ఒక్కరూ సమాజంలో మిగతావారికి ఏవిధంగా సహాయం చేయాలనే విష యం గురించి తెలియచేస్తాను. మిత్రులతో కలిసి సాయి అనాథ సేవా ట్రస్టు ఏర్పాటుచేసాం. తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలకి ఈ ట్రస్టుద్వారా సహాయం చేస్తుంటాం. మనం చేసే ప్రతి పని పదిమందికి ఉపయోగపడేదిగా ఉండాలనేది నా కోరిక. బీద వారికి సహాయం చేస్తే, భగవంతునికి సేవ చేసినట్లే అని నమ్ముతాను.

**- కె.రమేష్, హన్మకొండ వరంగల్ జిల్లా**